


# భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 313 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శనివారం, 05 సెప్టెంబర్ 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 313 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR SATURDAY, 05 SEPTEMBER 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


### రాజమండ్రిలో సగం కాలుష్యానికి

# కారణం ఇదే



- పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు
- రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్
- పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు
- స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం

## ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు



- అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!
- మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్
- డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ
- భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు
- 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- భారత్ విశ్వసనీయ రక్షణ భాగస్వామి అన్న గోర్

### ఎన్టీఆర్ ఆశయాలను ఆచరణలోకి తెచ్చింది చంద్రబాబే

- పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ పునాదులు వేశారన్న కాలవ శ్రీనివాసులు
- సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ చంద్రబాబు పాలన సాగిస్తున్నారని కితాబు

## రేవంత్ తలకాయ

# ఉందా... నీకు

- ఎవరు ఇంటర్మీడియేట్ విద్య తీసేయాలని అనడు ..
- ఇంటర్ విద్య బలంగా ఉంది.. దాని జోలికి వెళ్లొద్దు...
- సీఎం ప్రకటనలు చూస్తుంటే తుగ్లక్ కూడా సిగ్గు పడుతడు
- ఇంటర్ విద్య విధానం తీసేయాలకోవడం అంటే కొరివితో తలగొక్కునట్టే...
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత...




మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఎవరు కూడా ఇంటర్మీడియేట్ విద్య విధానం తీసేస్తామని అనుకోరని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇంటర్ విద్య విధానంపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే తుగ్లక్ కూడా సిగ్గుపడతాడని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇంటర్ విద్య జేఏసీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని మీడియా అకాడమీలో శు క్రవారం నిర్వహించిన సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్ జంగ్ సైరన్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

## ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు

- తన పేరుతో సర్క్యులేట్ అవుతున్న పోస్టులను ఖండించిన కొండా సురేఖ
- క్రమశిక్షణ చర్యల కింద కేబినెట్ నుంచి సురేఖకు ఉద్వాసన
- కుమార్తె వ్యాఖ్యలపై ఇచ్చిన షోకాజ్ నోటీసుతో మొదలైన వివాదం
- అధిష్ఠానాన్ని బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని రేవంత్ రెడ్డిపై ఆరోపణ
- కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేసిన మాజీ మంత్రి



హైదరాబాద్

తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి - మిగతా3లో




## నీటిని పొదుపుగా

# వాడుకోండి

- జలాశయాల్లో తగినంత నీళ్లు లేవు
- విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని వాడొద్దు
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి నియంత్రించాలి
- తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన
- నీటి పంపకాల్లో కుదరని ఏకాభిప్రాయం..
- వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం
- మరోసారి వాయిదా పడ్డ కృష్ణాబోర్డు భేటీ
- 50 శాతం తెలంగాణ వాటా అడిగాం
- తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు

-2లో

కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు.


-2లో

## పలు అభివృద్ధి పనులు

### పరిశీలించిన సీఎం రేవంత్

కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ముఖ్యమంత్రి ఆరా


-2లో

## సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా

# తాకనివ్వం

రాజగోపాల్‌రెడ్డిని కూడా బీఆర్ఎస్‌లోకి తీసుకోం

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

## హద్దులు దాటితే

### ఎవరిపైనైనా చర్యలు తప్పవు


-2లో


-2లో

## ఏఐకి పెరిగిన ఆదరణ

## మాజీ గవర్నర్ సుశీల్ కుమార్ షిండేని కలసి శ్రీనివాస్ గౌడ్

**వెల్దండ,సెప్టెంబర్ 04,మన సాక్షి:**



వెల్దండ మండలం పెద్దా పూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ కాంట్రాక్టర్ కమ్మగోని శ్రీనివాస్ గౌడ్ ముంబైలో మాజీ హోం మంత్రి, మాజీ గవర్నర్,మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండేను మర్యాదపూర్వకంగా ప్రత్యక్షంగా కలసి వారికి 86వ జన్మదిన శుభాకాంక్షలు, ఆత్మీయ అభినందనలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిగా, కేంద్ర మాజీ రక్షణ మంత్రిగా ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నర్‌గా ప్రజా జీవితంలోనూ,దేశ సేవలోనూ వారు అందించిన అసాధారణమైన సేవలు ఎంతో స్ఫూర్తిదా యకం,ఎల్లప్పుడూ ఎంతో గౌరవంతో గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.

## కూతురు కడసారి చూపుకే.. తల్లి ప్రాణం విడిచింది..!

### ఒకే కుటుంబంలో రెండు విషాదాలు.. దుర్శేడు గ్రామంలో హృదయ విదారక ఘటన

**కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 04, మన సాక్షి :**



కూతురు మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తీసుకెళ్తున్న సమయంలో తల్లికి గుండెపోటు రావడంతో మృతి చెందిన విషాద ఘటన కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడు గ్రామంలో చోటుచేసుకుంది. ఒకే కుటుంబంలో తల్లి, కూతురు ఇద్దరూ ఒకేరోజు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దుర్శేడు గ్రామానికి చెందిన శ్రీవిద్య గురువారం ఉదయం తన నివాసంలో మృతి చెందిన విషయం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టి, మృతదేహానికి సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టారు. కూతురు మృతి చెందిన విషయం తెలిసినప్పటి నుంచి ఆమె తల్లి బిల్లా సవిత (65), భర్త సత్యనారాయణ, తీవ్ర మనోవేదనతో ఉదయం నుంచి రోదిస్తూ ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం శ్రీవిద్య మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తీసుకెళ్తున్న సమయంలో సవితకు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థత, గుండెనొప్పి రావడంతో వెంటనే కరీంనగర్ రూరల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే ఆమె గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిసింది. కూతురు మృతితో కన్నీరుమున్నీరైన తల్లి, అదే రోజు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాద ఘటన తెలిసి దురిశేడు గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తదుపరి విచారణ చేపడుతున్నారు.

## కేబినెట్‌లోకి·రాములమ్మ..!?

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశంపై కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. ఆమె మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మహిళా మంత్రిగా ఉన్నారు. దీంతో సురేఖ స్థానంలో మరో మహిళా నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తరఫున పలువురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. విజయశాంతికి అవకాశంఇవ్వాలనే ఆలోచన రాష్ట్ర నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. పాలకుర్తి ఎమ్మెల్యే మమిడాల యశస్వినీ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్ నేతగా విజయశాంతి గుర్తింపు పొందారు. గతంలో బీఆర్ఎస్‌లో ఎంపీగా పనిచేసిన ఆమెకు ఆ పార్టీ రాజకీయాలు, నేతల వ్యవహారశైలిపై మంచి అవగాహన ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే విషయంలో విజయశాంతి వంటి బలమైన వాయిస్ కేబినెట్‌లో ఉంటే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వగల నేతగా ఆమెను పరిగణిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవిపై చర్చల నేపథ్యంలో విజయశాంతి ఢిల్లీకి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హైకమాండ్ పెద్దలను కలిసి తన రాజకీయ భవిష్యత్తు, మంత్రి పదవిపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. పార్టీపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయకుండా.. అప్పుడప్పుడు రాజకీయ అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. దీంతో ఆమెకు మంత్రివర్గంలో అవకాశం ఇస్తే పార్టీకి మరింత బలమైన స్వరం లభిస్తుందని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అన్నింటికంటే ఆసక్తికరంగా.. విజయశాంతి కేబినెట్‌లో చేరితే హోంశాఖ కావాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు కేబినెట్‌లోకి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను తీసుకునే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కేబినెట్‌లో రెండు ఖాళీలు ఉండగా.. తాజాగా కొండా సురేఖ బర్తరఫ్‌తో మొత్తం ఇద్దరు లేదా ముగ్గురు కొత్త ముఖాలను మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు సీనియర్ మంత్రుల శాఖలను మార్చే అవకాశాలపై కూడా కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే విజయశాంతికి నిజంగానే మంత్రి పదవి దక్కుతుందా.. దక్కితే ఆమె కోరుకుంటున్న హోంశాఖనే కేటాయిస్తారా.. అనే అంశాలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## ఏఐకి పెరిగిన ఆదరణ




నేటి యుగంలో ఎఐకి ఆదరణ బాగా పెరింగిందని చెప్పుకోవాలి. ప్రతీ సంస్థ దాదాపు ఎఐపై ఆధారపడటం మేడలు పెట్టాయి. ఆ దిశగా భారతదేశంలో 2024-2026 మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాల జీతాలు 23 శాతం పెరిగాయని, అదే సమయంలో కొన్ని సాంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల జీతాలు తగ్గాయని, ఇది ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసాన్ని పెంచుతోందని తెలిపింది. జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఏఐ రంగం వార్షిక ప్రాతిపదికన 12 శాతం జీతాల వృద్ధిని నమోదు చేసింది. ఇది పరిశీలించిన విభాగాలలో అత్యధికం. దీని తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ- సెమీకండక్టర్స్ చెరో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత రెండేళ్లుగా కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు ఇ-కామర్స్ వంటి రంగాలలో జీతాలు తగ్గుముఖం పట్టగా, ఐటీ సేవల రంగంలో జీతాలు స్తంభించిపోయాయని నివేదిక పేర్కొంది. 0-3 సంవత్సరాల అనుభవం ఉన్న ఎంట్రీ-లెవల్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 8.87-15.41 సంపాదిస్తుండగా, 15 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99-89.24 లక్షల వరకు పెరుగుతుంది. ఏఐ వేతనాలు ప్రాంతాన్ని బట్టి గణనీయంగా మారుతూ ఉంటాయి. ఇది ప్రత్యేక నైపుణ్యం ఉన్న యజమానులు, పరిణతి చెందిన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లు ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయో ప్రతిబింబిస్తుంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ-కేంద్రీకృత స్టార్టప్‌లు, ప్రపంచ సామర్థ్య కేంద్రాల సాంద్రత కారణంగా, బెంగళూరు భారతదేశంలో అత్యధిక వేతనాలు ఇచ్చే మార్కెట్‌గా కొనసాగుతోంది. బెంగళూరులో సీనియర్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 61.70-91.25 లక్షలు సంపాదిస్తున్నారు. ఇది ఎన్‌సిఆర్ లేదా ముంబై కంటే సుమారు 10-15 శాతం ఎక్కువ, సీనియర్ స్థాయిలో చెన్నై కంటే 40 శాతం వరకు అధికం. విస్తరిస్తున్న జిసిసి, ఉత్పత్తి ఇంజనీరింగ్ పెట్టుబడుల మద్దతుతో హైదరాబాద్ దీనికి గట్టి పోటీదారుగా ఎదుగుతోంది. సైబర్‌సెక్యూరిటీ రంగంలో గరిష్ఠ వేతన పరిమితి సంవత్సరానికి రూ. 97.81 లక్షలు, ఇది పరిశీలించిన అన్ని విభాగాలలోకెల్లా అత్యధికమని నివేదిక పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఐటి సర్వీసెస్‌లో ప్రారంభ వేతనం సంవత్సరానికి రూ. 2.68-5.08 లక్షలతో మొదలై, 15 ఏళ్లకు పైబడిన వారికి సంవత్సరానికి రూ. 57.55--72.13 లక్షలకు చేరుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ రెండు విభాగాలలోనూ వేతనాల్లో 1 శాతం తగ్గుదల నమోదైంది. కంపెనీలు దేనికి అధిక వేతనం చెల్లించాలనే విషయంలో ఎంపిక చేసుకుంటున్నాయి. కేవలం అనుభవం మాత్రమే ఇకపై అత్యధిక జీతాల పెంపును అందించడం లేదు. ఒక నైపుణ్యం వ్యాపారానికి అవసరమైన సామర్థ్య లోపాన్ని పూరిస్తుందా లేదా అన్నదే ముఖ్యం. అది ఏఐ వ్యవస్థలను నిర్మించడం, మౌలిక సదుపాయాలను భద్రపరచడం, ఫ్యాక్టరీలను

# నీటిని పొదుపుగా వాడుకోండి




న్యూఢిల్లీ: తెలుగురాష్ట్రాలకు కేఆర్ఎంబీ కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని ప్రాజెక్టుల నుంచి దిగువకు విడుదల చేయొద్దని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలంది. రెండు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందువల్ల పొదుపుగా వాడుకోవాలని సూచన చేసింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్?ఎంబీ స్పష్టం చేసింది. కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం--నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలంగాణ తరఫున పాల్గొన్న ఈఎన్సీ సభ్యుడు రమేష్ బాబు మాట్లాడుతూ తాగునీటిపై త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చ జరిగిందని వివరించారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం చెరో 50శాతం వాటా తీసుకోవాలని తెలంగాణ కోరగా ఏపీ పాత పద్ధతిన 66:34 వాటా లెక్కన పంపిణి చేయాలని డిమాండ్ చేసిందని వెల్లడించారు. 66:34 నిష్పత్తి డిమాండ్ ను మూడేళ్లుగా తాము అంగీకరించడం లేదని తెలిపారు. ఇప్పటికే పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను తీసుకపోతోందని, ఇప్పుడు వెలిగొండ నుంచి కూడా నీరు తీసుకుంటున్నారని వివరించారు. మొత్తం తెలంగాణ 200 టీఎంసీలు, ఏపీ 100 టీఎంసీలను అడిగిందని అన్నారు.సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే బోర్డు సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చిస్తామని పేర్కొన్నారు. ఏపీ ఈఎన్సీ సభ్యుడు నరసింహామూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. 66:34 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టీఎంసీలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని వెల్లడించారు.తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటున్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు.రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, ఇతర జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు.

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు

### సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.



## సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

హైదరాబాద్: మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్ లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా.. ఆయనను తమ పార్టీలోకి తీసుకోబోమని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు.

## కేసీఆర్ చాలా మంచోడు

వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.

## సమాజంలో యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

### ఎమ్మెల్యే మైనపల్లి లోహిత్ రావ్.

**శివంపేట సెప్టెంబర్ 4 మన సాక్షి**



సమాజంలో యువత సేవా కార్యక్రమాల పట్ల మొగ్గు చూపవలసిన అవసరం ఉన్నదని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు. ప్రముఖ నిర్మాత డైరెక్టర్ బండ్ల గణేష్. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్. లు అన్నారు. మండల కేంద్రమైన శివంపేటకు చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ కుమారుడైన కొడకంచి శివప్రసాద్ గౌడ్. లను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్. మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు. ప్రముఖ నిర్మాత డైరెక్టర్ బండ్ల గణేష్. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్కుల మహిపాల్ రెడ్డి. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ లు ఘనంగా శివ ప్రసాద్ గౌడ్ ను జన్మదిన వేడుకల్లో భాగంగా ఘనంగా శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు వారు తెలిపారు. ప్రత్యేకంగా హైదరాబాద్కు పిలిపించి శాల్వాలకు పూలమాలలతో కొడకంచి శివప్రసాద్ గౌడ్ కు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కే నరసింహ గౌడ్. కే రవీందర్ గౌడ్ కే శ్రీనివాస్ గౌడ్ కే శివ ప్రసాద్ గౌడ్. యువకులు షేక్ సల్మాన్. అభిమానులు నాయకులు కార్యకర్తలు బంధువులు తదితరులు ఉన్నారు



## సొరంగంలో మృత్యుంజయులు

దెబ్బతింది. సొరంగంలో సుమారు 42 మంది చిక్కుకుపోయారు. అక్కడ సహాయక చర్యలు కొనసాగిస్తున్న సిబ్బంది.. మెకానికల్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్ (45), ఫోర్‌మ్యాన్ సంజయ్ సాహ్ (30)లను తాజాగా ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. మహర్జన్ పరిస్థితి విషమంగా ఉంది. - సొరంగంలో చిక్కుకున్నాక 9 రోజులూ తాను 'హరే కృష్ణ' జపం చేస్తూ ఉన్నానని సంజయ్ సాహ్ తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి రోజే ఆయన సొరంగం నుంచి బయటపడి పునర్జన్మ పొందడం గమనార్హం. - నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో వరద విలయంతో మొత్తం 275 మంది భారతీయులు గల్లంతైనట్లు విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. నేపాల్‌కు మరో 21.5 టన్నుల సహాయక సామగ్రిని విమానాల్లో భారత్ గురువారం రాత్రి పంపింది.సంజయ్ సాహ్‌ను వెలుపలికి తీసుకొస్తున్న నేపాల్ సైనికులు
ఎలా రక్షించారంటే...తొమ్మిది రోజుల తర్వాత కార్మికులను ఎలా రక్షించారు? బురదతో కూడుకున్న టన్నెల్‌లో 170 మీటర్ల లోతు నుంచి ఎలా బయటకు తీసుకొచ్చారన్నది ఆసక్తికరం! దీంతో మిగిలినవారి పైనా ఆశలు రేగుతున్నాయి.

## పలు అభివృద్ధి పనులు పరిశీలించిన సీఎం రేవంత్

### కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

### హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ముఖ్యమంత్రి ఆరా

హైదరాబాద్: కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాం?ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్?ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

గుంటూరు
శనివారం, 05 సెప్టెంబర్ 2026 వార్తలు



## శని మరియు ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

**గుంటూరు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శని,ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లోను ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు (బి.ఎల్.ఓ) ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గం వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. ముసాయిదా ఓటరు జాబితా బి.ఎల్.ఓల వద్ద లభ్యంగా ఉందని, ఓటర్లు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటరు జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరునమోదు చేసుకొనుటకు, వివరాల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయుటకు సంబంధిత పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓలను సంప్రదించి ఫారం 6, 7 లేదా 8 అందించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటును పదిలపరచుకోవాలని కోరారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి వచ్చే వారికి స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మూడు నెలల తరువాత బాలిక కిడ్నాప్ కేసులో అరెస్ట్!




నిందితుడు షేక్ జాన్ సైదా ను హర్యానాలోని
కర్నూల్ లో పట్టుకున్న పోలీసులు
పదో తరగతి విద్యార్థినికి మాయమాటలు
చెప్పి తీసుకెళ్లిన జాన్ సైదా
విద్యార్థులు కిడ్నాప్ పై హైకోర్టులో
హైబియస్ కార్పస్ వేసిన బాలిక తండ్రి
మూడు నెలలైనా బాలిక ఆచూకీ
దొరక్కపోవడంపై హైకోర్టు ఆగ్రహం
సాంకేతిక ఆధారాలతో నిందితుడి
ఆచూకీ గుర్తింపు
బాలిక ఆచూకీ లభించడంతో ఊపిరి
పీల్చుకున్న గుంటూరు పోలీసులు

**గుంటూరు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ జాన్ సైదాను పోలీసులు హర్యానాలో అరెస్ట్ చేశారు. మూడు నెలలుగా బాలిక ఆచూకీ లభించకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితుడిని పట్టుకున్నారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను షేక్ జాన్ సైదా (రబ్బానీ) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తన కుమార్తె అపహరణకు గురైందని, ఆమెను తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ తుహిన్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం పోలీసుల వైఫల్యమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటు" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకోవడంలో చూపిన శ్రద్ధ, బాలికను రక్షించడంలో ఎందుకు చూపలేకపోయారని న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. ఈ కేసు దర్యాప్తులో స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, బాలికను గురువారం కోర్టులో హాజరుపరచాలని నేరుగా ఏపీ డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇంత తీవ్రంగా స్పందించడంతో, డీజీపీ సిట్ నియామకం జరిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే, సాంకేతిక ఆధారాలతో నిందితుడు జాన్ సైదా హర్యానాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని, బాలికను గుంటూరుకు తరలించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు.

## పిడుగురాళ్లలో ఇంటర్‌సిటీ ఎంప్లాయీ స్పెషల్‌కు స్టాపేజ్



**గుంటూరు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పిడుగురాళ్ల రైల్వే ప్రయాణికులకు రైల్వే శాఖ శుభవార్త అందించింది. రైలు నెం. 12795/12796 బి.జెడ్.ఎ-ఎల్.పి.ఐ-బి.జెడ్.ఎ ఇంటర్‌సిటీ ఎంప్లాయీ స్పెషల్‌కు సెప్టెంబర్ 4 నుంచి పిడుగురాళ్ల (పి.జి.ఆర్.ఎల్) రైల్వే స్టేషన్‌లో షెడ్యూల్డ్ స్టాపేజ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపాటినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగకృష్ణమూర్తి హాజరయ్యారు. కార్యక్రమంలో సుమారు 400 మంది పాల్గొన్నారు. 12795 నంబర్ రైలు పిడుగురాళ్లకు రాత్రి 7.41 గంటలకు చేరుకుని, రెండు నిమిషాల అనంతరం 7.43 గంటలకు బయలుదేరింది. ఈ స్టాపేజ్‌తో పిడుగురాళ్లతో పాటు పరిసర ప్రాంతాల ప్రయాణికులకు మెరుగైన రైలు సౌకర్యం, కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు గుంటూరు డివిజన్ కట్టుబడి ఉందని దక్షిణ తీర రైల్వే తెలియజేసింది.

## కొత్త పింఛన్లు పారదర్శకంగా మంజూరు చేస్తాం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి




**గుంటూరు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో అర్హులైన వారందరికీ దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పెన్షన్ మంజూరులో అర్హతే ప్రామాణికమని రాజకీయాలకు తావు లేదని ఎమ్మెల్యే తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రజా గ్రీవెన్స్‌లో కొత్త పింఛన్ల కోసం పెద్ద సంఖ్యలో అర్జీలు అందుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో అర్హులైన వారందరికీ దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచే ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హుల పేరుతో నిజమైన లబ్ధిదారులను పింఛన్ల జాబితా నుంచి తొలగించి, అధికారపార్టీకి ప్రయోజనం చేకూరేవిధంగా వ్యవహరించారని ఎమ్మెల్యే విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ పక్షపాతం చోటుచేసుకోవడం వల్ల ఎంతో మంది అర్హులు నష్టపోయారని అన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మాత్రం సంక్షేమ పథకాల అమలులో "అర్హతే ప్రామాణికం" అని గళ్ళా మాధవి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరులో ఎటువంటి రాజకీయ జోక్యాలకు తావు ఉండదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయి పారదర్శకతతో పింఛన్లు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజల సంక్షేమం విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ఒక్క లబ్ధిదారుడూ నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళామాధవి పేర్కొన్నారు.

## త్వరలో అర్హులందరికీ పింఛను : ఎమ్మెల్యే నసీర్





**గుంటూరు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రాష్ట్రంలో త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించారు. ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటామని తెలిపారు. ఎక్కువగా పింఛన్లు, ఇంటి స్థలాలు, శానిటేషన్, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు వచ్చాయని, సంబంధిత అధికారులకు అర్జీలను పంపించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, పింఛన్ల కోసం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే అర్హులైన వారిని గుర్తించామని, ప్రతి ఒక్కరూ సచివాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించ వచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని చెప్పారు. కూటమి నాయకులు స్థానిక ఎన్నికలకు సిద్ధమవ్వాలని, కలిసికట్టుగా అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి బలం చేకూర్చడం ద్వారా గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించుకోవచ్చన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సుమారు రూ.350 కోట్లు వెచ్చించామన్నారు. మురుగు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంతర్గత రోడ్లను సైతం సీసీలుగా తీర్చిదిద్దుతున్నామని, గత వైసీపీలో గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కేవలం రోడ్లనే కాకుండా పార్కులు, క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.

**కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ :** కృష్ణుడి జీవితం ప్రతి మానవుడికి మార్గదర్శకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక పాత గుంటూరులోని యాదవబజార్, మణి హోటల్ సెంటర్, ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురైనా నవ్వుతూ ఎదుర్కొనే ధైర్యం కృష్ణుడి బాల్యం నేర్పుతుందని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి బోధించిన భగవద్గీత సమాజానికి సన్మార్గం చూపించదని తెలియజేశారు.

## మత సామరస్యానికి మారుపేరు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్



**గుంటూరు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కృష్ణాష్టమి సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసి శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అందించి శుభాకాంక్షలు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ తెలియజేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నారని తెలుగుదేశం పార్టీ నేతలు పేర్కొన్నారు. మతాలకు అతీతంగా పండుగలను గౌరవిస్తూ, పరస్పర విశ్వాసం-సోదరభావాన్ని చాటుకోవడం ద్వారా నసీర్ ఆదర్శంగా నిలిచారని వారు పేర్కొన్నారు. "మతం వేరు కావచ్చు, మనసులు ఒక్కటే. పండుగలు వేరు కావచ్చు,మన ఆనందం ఒక్కటే" అనే సందేశాన్ని తన చర్య ద్వారా ఎమ్మెల్యే చాటి చెప్పారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే నసీర్, మత సామరస్యానికి నిదర్శనంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026లో గుంటూరు పోలీస్ అత్యుత్తమ ప్రతిభ

**గుంటూరు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీలలో గుంటూరు జిల్లా పోలీస్ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పోలీస్ యూనిట్లకు చెందిన క్రీడాకారులు హోరాహోరీగా పోటీపడ్డారు.

**గుంటూరు జిల్లా పోలీస్ క్రీడాకారులు సాధించిన విజయాలు :**

**ఫైరింగ్ విభాగం :** గుంటూరు ఎస్‌బీ సీఐ ఏ. మల్లికార్జునరావు స్టెన్ గన్ ఈవెంట్‌లో సెకండ్ ప్లేస్, కార్బైన్ ఈవెంట్‌లో థర్డ్ ప్లేస్ సాధించారు.

**వెయిట్ లిఫ్టింగ్ :** 85 కేజీల విభాగంలో స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరావు గోల్డ్ మెడల్ సాధించారు.

**కబడ్డీ :** స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఉమెన్ కానిస్టేబుల్ క్రాంతి కుమారి, పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఉమెన్ కానిస్టేబుల్ తిరుపతమ్మ గుంటూరు రేంజ్ తరపున పాల్గొని సెకండ్ ప్లేస్ సాధించారు.




**హ్యాండ్ రైజింగ్ :** స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన కానిస్టేబుల్ కాంతి కుమారి సిల్వర్ మెడల్ సాధించారు.

**డాగ్ స్క్వాడ్ :** గుంటూరు రేంజ్ డాగ్ స్క్వాడ్ రాష్ట్రస్థాయి పోటీలలో రన్నరప్‌గా నిలిచింది. కే. వేణుబాబు ఆధ్వర్యంలోని గుంటూరు డాగ్ స్క్వాడ్‌కు చెందిన 'సింబా' నార్కోటిక్ టెస్ట్ విభాగంలో సెకండ్ ప్లేస్ సాధించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, విజేతలైన క్రీడాకారులను అభినందించారు. విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వాన్ని అందిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. క్రీడలు పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, క్రీడాస్ఫూర్తి మరియు జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విధి నిర్వహణతో పాటు ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వం, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న క్రీడాకారులతో హోరాహోరీగా సాగిన పోటీలలో గుంటూరు జిల్లా పోలీస్ సిబ్బంది ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించడం పట్ల జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# కొత్తవలసలో కోలాహలంగా కృష్ణాష్టమి వేడుకలు


### శ్రీకృష్ణుడి నామస్మరణతో మార్మోగిన, చిన్నారుల రాధాకృష్ణ వేషధారణ ప్రత్యేక ఆకర్షణ



**కొత్తవలస, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయనగరంజిల్లా కొత్తవలస మండలం అప్పన్నపాలెం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తవలసలో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది విష్ణు మాట్లాడుతూ తన మా తండ్రి యొక్క అప్పన పాలెం గ్రామంలో తిక్కన్న చిన్న దేవుడు లేకపోవడం వల్ల మాకు ఎంతో బాధాకరంగా ఉందని చెప్పారు మా తండ్రి ఎక్కడ ఉన్నా దేవుడు ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా గ్రామ పెద్దలు. తనయుడు అన్నారు. ఈ ఆలయాలనుకి గత 50 సంవత్సరాల నుండి విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. భక్తుల నామస్మరణలు, భజనలు, కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉట్టి కొట్టే కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీకృష్ణుడి బోధనలు, ధర్మమార్గం, సత్యనిష్ఠను ప్రతి ఒక్కరూ ఆచరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. భక్తుల ఆనందోత్సాహాల మధ్య కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చింతలపాలెంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. చిన్నారుల కృష్ణుడి వేషధారణలు ఆకట్టుకున్నాయి





**చింతలపాలెం, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయాలను పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భజనలు, కీర్తనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువత, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. శ్రీకృష్ణుడి బాల్య లీలలను స్మరించుకుంటూ భక్తులు వేడుకల్లో ఆనందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, మహిళలు, యువత, చిన్నారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో తూపుడుబండ్లతో ఇబ్బందులు



**ఇబ్రహీంపట్నం, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నందు తోపుడుబండ్ల వ్యాపారస్తులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారస్తులు రోడ్డుపైనే వ్యాపారం నిర్వహించడంతో వాటిని కొనేందుకు వచ్చిన వారు వాహనాల ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు అధికారులు తోపుడుబండ్ల వ్యాపారస్తులను తొలగించినప్పటికీ మరల ఇక్కడకు చేరుకొని వ్యాపారం నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్ అంతరాయమే కాకుండా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# విజయవాడలో అపరిశుభ్ర హోటళ్లపై వీఎంసీ కొరడా

### కెనాల్ రోడ్డులోని హోటళ్లలో ప్రజారోగ్య విభాగం ఆకస్మిక తనిఖీలు
### మూడు హోటళ్లకు ఒక్కొక్కదానికి రూ. 5,000 జరిమానా
### లోపాలు సరిదిద్దకుంటే ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరిక





**విజయవాడ, 04 సెప్టెంబర్ 2026, భరత్ ప్రతినిధి న్యూస్ :** నగర ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, కనీస పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించని హోటళ్లు, ఆహార విక్రయ కేంద్రాలపై విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం ఉదయం నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని కెనాల్ రోడ్డు ప్రాంతంలో విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

**వంటగదుల్లో తీవ్ర అపరిశుభ్రత, నిల్వ ఆహారాలు**

కెనాల్ రోడ్డు ప్రాంతంలోని ప్రముఖ హోటళ్లయిన స్వీట్ మ్యాజిక్, తాజ్ హోటల్, హోటల్ సాయి సరోవర్, మంగమ్మ కిచిడీ సెంటర్లలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్లలోని వంటగదులను (కిచెన్లను) క్షుణ్ణంగా తనిఖీ చేయగా విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి.

**వంటగదుల గోడలకు టైల్స్ లేకపోవడం, గోడలపై తీవ్రస్థాయిలో బూజు పట్టి ఉండటం.**

**పరిసరాలు అత్యంత మురికిగా, అపరిశుభ్ర వాతావరణంలో ఉండటం.**

**ఆహార పదార్థాలను ఎలాంటి మూతలు లేకుండా బహిరంగంగా నిల్వ ఉంచడం, నాణ్యత కోల్పోయిన పాత నిల్వ ఆహారాలను గుర్తించడం.**

**వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందించకపోవడం.**

**అవసరమైన మేర మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్న మరుగుదొడ్లను సైతం సరైన నిర్వహణ లేకుండా దుర్వాసనతో వదిలేయడం.**

ఈ తరహా తీవ్ర లోపాలు, ప్రజారోగ్యానికి హాని కలిగించే అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తుండటాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు.

**జరిమానాలు విధింపు – నోటీసులు జారీ**

ప్రజారోగ్య నిబంధనలను ఉల్లంఘించినందుకు సంబంధిత మూడు హోటళ్లకు ఒక్కొక్కదానికి రూ. 5,000 చొప్పున జరిమానా విధించారు. తక్షణమే ఆ మొత్తాన్ని వసూలు చేయడంతో పాటు యాజమాన్యాలకు అధికారిక నోటీసులు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా గుర్తించిన లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దుకోవాలని, లేనిపక్షంలో చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు హోటళ్ల ట్రేడ్ లైసెన్సులను రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ప్రజారోగ్యమే ప్రథమ ప్రాధాన్యం: అధికారులు నగరంలోని ప్రతి హోటల్, రెస్టారెంట్, టిఫిన్ సెంటర్ మరియు ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా శానిటేషన్ ప్రమాణాలు పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో తయారుచేసిన నాణ్యమైన ఆహారం, శుద్ధి చేసిన తాగునీరు అందించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తనిఖీల్లో సర్కిల్-1 శానిటరీ సూపర్‌వైజర్ డి. సోమరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్లు బి. యోగేంద్ర కుమార్, ఎం. రవిశంకర్ మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# పెదకాకాని ఆలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత !

### కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలు : వైఎస్ఆర్‌సిపి నేతలు
### వైసీపీ నాయకులు భక్తులకు, ఆలయానికి క్షమాపణ చెప్పాలని టీడీపీ శ్రేణులు మరియు స్థానికులు డిమాండ్





**పెదకాకాని, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జిల్లాలోని పెదకాకాని శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇటీవల ఆలయంలో అమ్మవారి నాన్రాడు (మంగళసూత్రం) మాయమైన నేపథ్యంలో, వైసీపీ నాయకులు కొత్త నాన్రాడును సమర్పించడానికి ఆలయానికి తరలివచ్చారు. పరిస్థితి విషమించకుండా ఉండేందుకు పెదకాకాని ఆలయ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. అయితే, రాజకీయ ప్రయోజనాల కోసం ఆలయ ప్రతిష్టను మంటగలుపుతున్నారని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు భక్తులకు, ఆలయానికి క్షమాపణ చెప్పాలని టీడీపీ శ్రేణులు మరియు స్థానికులు డిమాండ్ చేశారు. ఆలయానికి వస్తున్న వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాడి విష్ణు వాహనాన్ని టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య నెట్టివేతలు, వాగ్వాదం జరిగాయి. పోలీసులు ఇప్పటికే ఈ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేశారని, అయితే వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఆ నిందితుడు నిర్దోషి అంటూ ఆలయ పవిత్రతను దెబ్బతీసేలా రాజకీయం చేస్తున్నారని టీడీపీ విమర్శించింది. ప్రభుత్వం, దేవాదాయ శాఖ వైఫల్యం వల్లే ఆలయంలో దొంగతనం జరిగిందని, తాము భక్తుల కానుకలతో చేయించిన రూ. 18 లక్షల విలువైన నాన్రాడును సమర్పించడానికి వస్తే కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసీపీ నేతలు ఆరోపించారు. వైసీపీ నాయకులు ఆలయం నుండి వెళ్లిన తర్వాత, ఆలయ పరిసరాలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడంపై కూడా ఇరు పార్టీల మధ్య తీవ్రమైన రాజకీయ విమర్శలు నడుస్తున్నాయి.

# గీతా మందిరంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ





**వెల్లటూరు/భట్టిప్రోలు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** బాపట్ల జిల్లా రేపల్లె ఖండ భట్టిప్రోలు మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో వెలసియున్న శ్రీ గీతా మందిరం ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి పర్వదిన వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలు, అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ ఆధ్యాత్మిక సంబరాలలో ముఖ్య అతిథులుగా జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ, జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు మానవాళికి ప్రబోధించిన భగవద్గీత సందేశం నిత్యనూతనమని, ధర్మమార్గంలో నడుస్తూ సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో భక్తిభావంతో పాటు శాంతి, సామరస్యాలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అతిథులకు ఘనంగా తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఖండ కన్వీనర్ క్రాప రవికుమార్, స్థానిక భక్తులు,మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణనామస్మరణతో మందిర ప్రాంగణాన్ని మార్మోగించారు.

# గుంటూరులో భారతదేశ హస్తకళల మరియు చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం




**గుంటూరు, 04 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరులో భారతదేశ హస్తకళల మరియు చేనేత వస్త్ర ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు ఈస్ట్ ఎమెల్యే మొహమ్మద్ నజీర్ అహ్మద్ పాల్గొని మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిలో అంతర్భాగమైన చేనేత వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత ఉండేది. భారతదేశ జాతి గర్వించదగిన కళారూపాలు నాటి ప్రభువుల ఆదరణ, ప్రోత్సాహంతో గొప్పగా విరజిల్లి నేటి నవీన జీవన స్రవంతిలో ప్రజలకు అందుబాటులోకి రాక ప్రజాదరణ కోల్పోవు చున్నారు. ఇటువంటి కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించి కనుమరుగవుతున్న హస్త కళారూపాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి కళాకారులకు జీనోపాధి కల్పించడం, వారి సంక్షేమం కోసం కృషి చేసే ప్రయత్నంలో భాగంగా హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ప్రారంభించబడింది విజయశ్రీ హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఆర్టిసన్ డెవలప్మెంట్ సొసైటీ మన గుంటూరులో తేది 4.9.2026 నుండి తేది 21.10.2026 వరకు గుంటూరుగోల్డ్ లో 75కి పైగా స్టాల్స్ తో ప్రజాదరణ పొందుతుందని క్రాఫ్ట్ బజారు నిర్వాహకులు అశ్విన్ కుమార్ జైస్వాల్ అన్నారు. ఇంకా ఈ క్రాఫ్ట్ బజారు తేది. 21.10.2026 వరకు వుంటుందని, గుంటూరు ప్రజలు ఈ అద్భుత అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అన్నారు. భారతదేశ హస్తకళల మరియు చేనేత వస్త్ర ప్రదర్శన ద్వారా దేశంలోని వివిధ నాగరికతలకు సంబంధించిన వస్తువులు తమ స్టాల్స్ లో అందుబాటులో వున్నాయని ఆయన అన్నారు.మా యొక్క ప్రదర్శనలో బెడ్ షీట్స్, కాటన్, సిల్క్ శారీస్, మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్ శారీస్, కలంకారి బెడ్ షీట్స్, నర్సాపూర్ లేస్లు, వెంకటగిరి శారీస్, లక్నో మెటీరియల్ శారీస్, వరంగల్ ధర్రీస్, జైపూర్ బెడ్ షీట్స్, రాజస్థాన్ శారీస్, యుపి హ్యాండ్లూమ్స్ బెడ్ షీట్స్, చేనేత డోర్ కర్టెన్స్, పంచలోహ జ్యుయలరీ, ఉడెన్ స్టాండ్స్, మైసూర్ అగర్ బత్తి, ఆర్టిఫిషియల్ జ్యుయలరీ, పెరల్స్, కొండపల్లి కొయ్య బొమ్మలు, ఏటికొప్పాక లక్క బొమ్మలు, హైదరాబాద్ బంజారా ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగులు, హైదరాబాద్ ముత్యాలు, వైట్ మెటల్ బొమ్మలు, బ్లాక్ మెటల్, వైట్ ఉడ్, రోజ్ ఉడ్, ప్యానల్స్, రుద్రాక్ష పూజ మాలలు, బెంగాల్ కాటన్ శారీస్, నార్త్ ఈస్ట్ డ్రై ఫ్లవర్ మరియు మగువల మనసు దోచే వస్త్ర కళారూపాలు, ఇంటికి అలంకరణ సామాగ్రి, చిన్నారులకు అలరించే అందమైన ఆటబొమ్మలు, ఇంకా ఎన్నో వెరైటీలు కలవు అని సెక్రటరీ అతీన్ కుమార్ జయిశ్వాల్ తెలిపారు.

# కొండా సురేఖను తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి?

**బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు**

**హైదరాబాద్,సెప్టెంబర్3 :** తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

# సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్..

**కేసు నమోదు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు**

**హైదరాబాద్, సెప్టెంబర్4 :** సాధారణంగా ముఖ్యమంత్రులకు భద్రత చాలా కట్టుదిట్టంగా ఉంటుంది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటించిన సమయంలో బందోబస్తుకు సంబంధించిన అత్యంత రహస్య వివరాలను సోషల్ మీడియాలో బహిర్గతం చేసిన ఘటనలో కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ భద్రతా వివరాలను పోస్ట్ చేసినందుకుగానూ తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతా నిర్వాహకులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. మొదట ఈ ఫిర్యాదుతో జులై 14న ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర విచారణ కోసం ఈ కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి రీ–రిజిస్టర్ చేశారని సమాచారం. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 13న సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనకు సంబంధించిన నిమిషాల వారీ పూర్తి షెడ్యూల్, భద్రతా ఏర్పాట్లపై ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ఆర్‌జీఐఏ, డీజీపీ వంటి ఉన్నతాధికారులకు ఒక వైర్‌లెస్ సందేశం ద్వారా సమాచారం పంపాం. జెడ్ ప్లస్ (ం) కేటగిరీ భద్రతకు అనుగుణంగా చేసిన ఈ ఏర్పాట్ల సందేశంలో సీఎం బ్లడ్ గ్రూప్, సీఎస్‌వో ఫోన్ నంబర్ వంటి అత్యంత సున్నితమైన అంశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటన కొనసాగుతుండగానే ఈ అత్యంత రహస్య వైర్‌లెస్ సమాచారాన్ని తెలుగు స్క్రైబ్ అనే ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి భద్రతాపరమైన వివరాలన్నీ బహిర్గతమయ్యాయి. నిబంధనల ప్రకారం వైర్‌లెస్ సందేశాలను బయటకు పొక్కనివ్వకూడదు. అయితే అధికారుల్లో ఎవరైనా అక్రమంగా ఈ సమాచారాన్ని ఆ సోషల్ మీడియా ఖాతాకు చేరవేసి ఉంటారని సీఎస్‌వో తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. ఈ విధి నిర్వహణలో తలెత్తిన లోపం, సీఎం రేవంత్ భద్రతా ఉల్లంఘనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జూన్ 14న ఖైరతాబాద్ పీఎస్‌లో కేసు నమోదుకాగా, సమగ్ర దర్యాప్తు కోసం సైబర్ క్రైమ్ విభాగానికి కేసు బదిలీ చేసి రీ రిజిస్టర్ చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# జలాశయాల్లో తగినంత నీళ్లు లేవు

**ఉన్న నీటిని పొదుపుగా వాడుకోండి.. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని వాడొద్దు**

**పోతిరెడ్డిపాడు నుంచి నీటి నియంత్రించాలి.. తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :** తెలుగురాష్ట్రాలకు కేఆర్ఎంబీ కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని ప్రాజెక్టుల నుంచి దిగువకు విడుదల చేయొద్దని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలంది. రెండు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందువల్ల పొదుపుగా వాడుకోవాలని సూచన చేసింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్?ఎంబీ స్పష్టం చేసింది. కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం--నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తెలంగాణ తరుఫున పాల్గొన్న ఈఎన్సీ సభ్యుడు రమేష్ బాబు మాట్లాడుతూ తాగునీటిపై త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చ జరిగిందని వివరించారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం చేరో 50శాతం వాటా తీసుకోవాలని తెలంగాణ కోరగా ఏపీ పాత పద్ధతిన 66:34 వాటా లెక్కన పంపిణి చేయాలని డిమాండ్ చేసిందని వెల్లడించారు. 66:34 నిష్పత్తి డిమాండ్ ను మూడేళ్లుగా తాము అంగీకరించడం లేదని తెలిపారు. ఇప్పటికే పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను తీసుకపోతోందని, ఇప్పుడు వెలిగొండ నుంచి కూడా నీరు తీసుకుంటున్నారని వివరించారు. మొత్తం తెలంగాణ 200 టీఎంసీలు, ఏపీ 100 టీఎంసీలను అడిగిందని అన్నారు. సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే బోర్డు సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చిస్తామని పేర్కొన్నారు. ఏపీ ఈఎన్సీ సభ్యుడు నరసింహమూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. 66:34 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టీఎంసీలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని వెల్లడించారు. తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు. తమ వాటా నుంచే పోతిరెడ్డి పాడు, వెలిగొండ ద్వారా నీరు తీసుకుంటున్నామని, ఎవరి వాటా అడగడం లేదని తెలిపారు. రాయలసీమతో పాటు మార్కాపురం, పల్నాడు, జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం నీరు ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు.

# డాటా.. ఏఐ రంగాలకు స్వర్ణయుగం..

**యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి**

**ఐటీని టైర్-2, 3 సిటీలకు విస్తరించాలి : కేటీఆర్**

**బీఆర్ఎస్ పాలనలో చిన్న పట్టణాల్లో ఐటీ హబ్‌లు**

**స్మార్ట్‌ఫోన్లలో ప్రతి స్వైప్ వెనుక కంటెంట్ క్రియేషన్**

**కాన్‌స్టర్ సొల్యూషన్స్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో కేటీఆర్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :** డాటా, ఏఐ రంగాలకు స్వర్ణయుగం రాబోతున్నదని, టైర్–2, 3 నగరాల్లోని ప్రతిభావంతులైన యువత వీటిలో అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ ప్రైమియా భవనంలో కాన్‌స్టర్ సొల్యూషన్స్ కంపెనీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ కార్యకలాపాలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కేటీఆర్‌కు వివరించారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్నదని, ముఖ్యంగా డాటా, డాటా సెంటర్లు, సర్వర్లు, కృత్రిమ మేధస్సు(ఏఐ), కంటెంట్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఈ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉజ్వల భవిష్యత్ ఉన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం, పరిశ్రమ రెండు రంగాల కోణాల నుంచి రెండు దశాబ్దాలుగా టెక్నాలజీ ప్రపంచాన్ని అత్యంత దగ్గరగా చూసిన అనుభవంతో చెబుతున్నానని వివరించారు. తాను కూడా రెండు దశాబ్దాల క్రితం కార్పొరేట్ ప్రపంచంలో పనిచేశానని, అమెరికాలో విద్యాభ్యాసం చేసి అక్కడ కొంతకాలం ఉద్యోగం చేసిన అనుభవం ఉన్నదని కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ టైమ్‌జోన్లలో పనిచేస్తూ, అనేక దేశాల ఖాతాదారులతో కలిసి పనిచేయడం ఎంతటి సవాలో తనకు తెలుసని చెప్పారు.

### 'కన్వర్జెన్స్ ఆఫ్ స్టోరేజ్' భావన ఆసక్తికరం

కాన్‌స్టర్ పేరుపై సరదాగా స్పందించిన కేటీఆర్, సంస్థ పేరు వెనకున్న 'కన్వర్జెన్స్ ఆఫ్ స్టోరేజ్' అనే భావన తనకు ఆసక్తికరంగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా కంటెంట్ వినియోగం, ఉత్పత్తి విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దానిని నిల్వ చేయడం, నిర్వహించడం, ప్రపంచానికి చేరవేయడంలో కాన్‌స్టర్ సంస్థలకు కీలక పాత్ర ఉంటుందని చెప్పారు. నేటితరం సమాచారాన్ని పొందే విధానమే మారిపోయిందన్నారు. గతంలో వార్తాపత్రికలను పేజీపేజీగా చదివే రోజులుండేవని, ప్రస్తుత యువతరం మొబైల్ ఫోన్‌లో స్వైప్ చేస్తూ ప్రపంచాన్ని చూస్తున్నదని పేర్కొన్నారు. డిజిటల్ విప్లవంతో డేటా, స్టోరేజ్ రంగాల ప్రాధాన్యత మరింత పెరుగు తుందని చెప్పారు.

### కేసీఆర్ పాలనలో ఐటీపై ప్రత్యేక దృష్టి

కేసీఆర్ పాలనలో ఐటీరంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించామని కేటీఆర్ చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని టైర్–2 నగరాలకు విస్తరించే లక్ష్యంతో అనేక ఐటీ హబ్‌లు నిర్మించామని గుర్తుచేశారు. ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, మహబూబ్‌నగర్, కరీంనగర్ లాంటి నగరాల్లో స్థానికంగా ప్రతిభ కలిగిన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఐటీ హబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. కొవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా పనిచేసే విధానాన్ని పూర్తిగా మార్చేసిందని కేటీఆర్ స్పష్టంచేశారు. ఒకప్పుడు కార్యాలయానికి వచ్చి, ఒకేచోట కలిసి పనిచేస్తే పనులు జరుగుతాయని భావించేవాళ్లమని, కొవిడ్ తర్వాత ఎక్కడి నుంచైనా పనిచేసి సమర్థవంతంగా ఫలితాలు సాధించవచ్చని నిరూపితమైందని పేర్కొన్నారు.

### ప్రతిభ అత్యంత కీలకం

కాన్‌స్టర్ సొల్యూషన్స్ టైర్–2, టైర్–3 నగరాలపై ప్రత్యేక దృష్టిపెట్టడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత మారిన ప్రపంచంలో భౌగోళిక పరిమితులు పెద్ద అడ్డంకి కాదని, ప్రతిభ మాత్రమే ముఖ్యమని నొక్కిచెప్పారు. టైర్–2, 3 నగరాలు, చిన్న పట్టణాలు, గ్రామాల్లో ఉన్న వారిలో దాగిన ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పిస్తే కంపెనీలు అద్భుతంగా పురోభివృద్ధి సాధిస్తాయని అభిప్రాయపడ్డారు. యువతను ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు తీసుకురావడం కంటే, కంపెనీలు వారి వద్దకే వెళ్లి అవకాశాలు కల్పించాలని సూచించారు. కాన్‌స్టర్ సొల్యూషన్స్ ఉద్యోగుల సంఖ్యను మరింత విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుండడం అభినందనీయమని చెప్పారు. కాన్‌స్టర్ సొల్యూషన్స్ సంస్థ వ్యవస్థాపకులు, నాయకత్వ బృందం, ఉద్యోగులందరికీ కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. సంస్థ భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

**రాజగోపాల్‌రెడ్డిని కూడా బీఆర్ఎస్‌లోకి తీసుకోం**

**మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్, సెప్టెంబర్4 :** మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్ లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు. పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా.. ఆయనను తమ పార్టీలోకి తీసుకోబోమని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి రావాలని ప్రయత్నాలు చేశారని పేర్కొన్న మాజీ మంత్రి.. అయినప్పటికీ ఆ ప్రయత్నాలను తమ పార్టీ తిరస్కరించిందని గుర్తుచేశారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో పలువురు నేతలు బీఆర్ఎస్‌పై, పార్టీ నాయకత్వంపై నేరుగా విమర్శలు చేశారని.. అలాంటి వారిని తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన జగదీశ్‌రెడ్డి.. సంచలన వ్యాఖ్యలు చేశారు. బర్తరఫ్ చేయాల్సింది కొండా సురేఖను కాదని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వంపై కొండా కుటుంబం అవినీతి ఆరోపణలు చేసిందని.. వాటిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతోందని తాము ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఆధారాలు పంపించామని పేర్కొన్నారు. అయితే ఇవన్నీ బీఆర్ఎస్ నేత చేసిన ఆరోపణలేనని, వాటిపై సంబంధిత సంస్థల అధికారిక నిర్ధారణ వెలువడలేదని గమనించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేస్తోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆ పార్టీ తీవ్ర అంతర్గత సంక్షోభంలో ఉందని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదుల్లో నీటి లభ్యత ఉన్నందున కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ సోదాలపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. ఆ దాడులపై ఈడీ ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయలేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మద్దతు ఉందని ఆరోపించారు. శాసనసభ ఎథిక్స్ కమిటీ నిజాయితీగా వ్యవహరించాలని జగదీశ్‌రెడ్డి కోరారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరగకపోయినా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్ జరిగే అవకాశం ఉందని జగదీశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, డీలిమిటేషన్ ద్వారా ఆ రాజకీయ పరిస్థితి నుంచి బయటపడవచ్చని చంద్రబాబు భావిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు

**కేటీఆర్ పిలుపుతో కదంతొక్కిన బీఆర్ఎస్ నేతలు**

**ప్రజా పాలన కాదు.. కాంగ్రెస్ దోపిడీ పాలన**

**మాజీ మంత్రి తలసాని సంచలన ఆరోపణలు**

హైదరాబాద్, సెప్టెంబర్4 : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు కన్నీళ్లే మిగిలాయని బీఆర్ఎస్ శ్రేణులు ధ్వజమెత్తాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నారు నేతలు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే పద్మారావు, సిరిసిల్లలో, దేవరకద్రలో గులాబీ సైన్యం ఆందోళనలు చేపట్టింది. వికారబాద్ జిల్లా నవాబ్‌పేటలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరును సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లా మాధవి అనే దివ్యాంగురాలు తన గోడును వెళ్లబోసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సమస్యలు ఒక్కటి కూడా పట్టించుకోవడం లేదని ఆమె కన్నీటిపర్యంతమైంది. దివ్యాంగుల కోసం ఏం చేసిందో ఈ ప్రభుత్వం చెప్పాలని ఆమె ఎమ్మెల్యే పద్మారావు ముందు తన బాధను పంచుకుంది. స్థానిక ఎమ్మెల్యేగా మా దివ్యాంగుల సమస్యలను మీరైనా తీర్చాలని పద్మారావు గౌడ్‌ను కోరింది మాధవి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగడుతూ.. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు రోడ్డుపైనే వంట చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆరోపించారు. గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ మహిళలు, దివ్యాంగుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు,వికలాంగులు, మహిళలకు రూ. 2500, కేసిఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ (తులం బంగారం), విద్యార్థులకు స్కూటీ హామీలు మరిచిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు వంటవార్పు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాట ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులునిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆల వెంకటేశ్వర్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేసి, ప్రజలకు మద్దతుగా పోరాడుతున్న బీఆర్ఎస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు. మీ పోరాటాన్ని ఇలాగే కొనసాగించాలని సూచించారు. కాగా, జిల్లాలోని చిన్నచింతకుంట మండల కేంద్రంలో 1000 రోజుల కాంగ్రెస్ విఫల పాలనకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలకు ఆల వెంకటేశ్వర్ రెడ్డి దీటుగా సమాధానమి చ్చారు. అలాగే అడ్డుకునేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడి నుంచి తరిమికొట్టారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఇస్రో మరో ఘన విజయం

### ఆకాశం నుంచి నిరంతర నిఘా

### ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన జీఎస్ఎల్వీ ఎఫ్17



**శ్రీహరికోట:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు జీఎస్ఎల్వీ ఎఫ్17 నింగిలోకి దూసుకెళ్లి, 2,367 కిలోల బరువున్న ఈఓఎస్--05 భూ పరిశీలన ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర బదిలీ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. దీంతో ఇస్రో విజయాల ఖాతాలో మరో మైలురాయి నమోదైంది. ఈఓఎస్--05 ప్రత్యేకత ఏమిటంటే.. భూస్థిర కక్ష్య నుంచి భూమిని చిత్రీకరించే సామర్థ్యంతో రూపొందించిన భారత తొలి భూ పరిశీలన ఉపగ్రహంగా ఇది నిలిచింది. కక్ష్యను క్రమంగా పెంచిన అనంతరం సుమారు 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ఇది పనిచేయనుంది. ఇప్పటివరకు భూ పరిశీలన ఉపగ్రహాలు తక్కువ ఎత్తు కక్ష్యల్లో భూమి చుట్టూ తిరుగుతూ వివిధ ప్రాంతాలను విడతలవారీగా పరిశీలించేవి. అయితే ఈఓఎస్--05 విస్తారమైన భూభాగాన్ని నిరంతరం గమనించేలా ప్రత్యేకంగా రూపొందించారు. భూమిపై చోటుచేసుకుంటున్న మార్పులను మరింత వేగంగా గుర్తించి, అవసరమైన సమాచారాన్ని దేశానికి అందించడమే ఈ ఉపగ్రహం ప్రధాన లక్ష్యం. వ్యవసాయ రంగంలో పంటల పరిస్థితిని పర్యవేక్షించడం, వర్షాభావం, అధిక వర్షాల ప్రభావాన్ని అంచనా వేయడం, వరదలు, తుపాన్ల సమయంలో ప్రభావిత ప్రాంతాలను త్వరగా గుర్తించడం వంటి సేవలకు ఈఓఎస్--05 చిత్రాలు ఎంతో ఉపయోగపడనున్నాయి. అలాగే అటవీ ప్రాంతాలు, నీటి వనరుల్లో చోటుచేసుకునే మార్పులను నిరంతరం గమనించేందుకు ఈ ఉపగ్రహం దోహదపడనుంది. ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలకు అవసరమైన సమాచారాన్ని వేగంగా అందించడంతోపాటు, దేశ వ్యూహాత్మక అవసరాలకు ఉపయోగపడే కీలక సమాచారాన్ని కూడా అందించే సామర్థ్యం దీనికి ఉంది. 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల ప్రయోగ బరువు కలిగిన జీఎస్ఎల్వీ ఎఫ్17 మూడు దశల్లో ప్రయాణించింది. ఇందులో క్రయోజెనిక్ దశ అత్యంత కీలకమైనది. ఈ దశను విజయవంతంగా పూర్తి చేసి ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి చేర్చడంతో ఇస్రో శాస్త్రవేత్తల సాంకేతిక సామర్థ్యానికి మరోసారి నిదర్శనం లభించింది. జీఎస్ఎల్వీ ద్వారా భూస్థిర బదిలీ కక్ష్యలోకి ప్రయోగించిన ఉపగ్రహాల్లో 2,367 కిలోల ఈఓఎస్--05 అత్యంత భారీ ఉపగ్రహంగా నిలిచింది. 2021లో ఈఓఎస్--03 ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన జీఎస్ఎల్వీ ఎఫ్10 ప్రయోగం క్రయోజెనిక్ పైదశలో ఏర్పడిన లోపం కారణంగా విఫలమైంది. ఆ నేపథ్యంలో తాజా ప్రయోగ విజయం ఇస్రోకు మరింత ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. 27 గంటల కౌంట్‌డౌన్ అనంతరం స్వల్ప వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. 2026లో ఇస్రో చేపట్టిన తొలి విజయవంతమైన ప్రయోగంగా జీఎస్ఎల్వీ ఎఫ్17 నిలిచింది. శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి జరిగిన ప్రయోగాల పరంపరలో ఇది 106వ ప్రయోగం కాగా, జీఎస్ఎల్వీకి 19వ ప్రయోగం కావడం విశేషం. ప్రయోగం అనంతరం ఈఓఎస్--05 సౌర ఫలకాలు విజయవంతంగా విచ్చుకున్నాయి. ఉపగ్రహంలోని అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నట్లు ఇస్రో శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. భూమిని నిరంతరం గమనించే కొత్త కంటిని ఆకాశంలోకి పంపిన ఇస్రో, దేశ భద్రత నుంచి వ్యవసాయం, విపత్తు నిర్వహణ వరకు అనేక రంగాలకు కీలక సమాచారాన్ని అందించే మరో శక్తిమంతమైన సాధనాన్ని భారత్‌కు అందించింది.

# మెలోనీ.. మీరు గ్రేట్!.. థ్యాంక్యూ మోడీ

### ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు

### అభినందనలు తెలిపిన భారత ప్రధాని.. ధన్యవాదాలు చెప్పిన ఇటలీ పీఎం



**న్యూఢిల్లీ :** ఇటలీకి అత్యధిక కాలంగా పనిచేస్తున్న ప్రధానిగా జార్జియా మెలోని రికార్డు సృష్టించారు. మెలోని అక్టోబరు 22, 2022 నుంచి ఇటలీ ప్రధానమంత్రిగా పనిచేస్తున్నారు. గురువారం 1,413 రోజుల నిరంతర పదవీకాలం పూర్తయిన తర్వాత, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశంలో అత్యధికకాలం నిరంతరం పనిచేసిన ప్రధాన మంత్రిగా ఆమె నిలిచారు. గత రికార్డు సిల్వియో బెర్లుస్కోని పేరిట ఉండేది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మెలోనిని అభినందిస్తూ, ఇటలీ ప్రజలు ఆమె నాయకత్వంపై ఉంచిన నమ్మకం, విశ్వాసం ఈ మైలురాయిలో ప్రతిబింబిస్తోందని చెప్పారు. నా స్నేహితురాలు ప్రధానమంత్రి మెలోనికి అభినందనలు అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆమెతో స్నేహం భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని, రెండు దేశాల ప్రజలకు సమృద్ధి భవిష్యత్తు నిర్మించేందుకు సన్నిహిత సహకారం కొనసాగించాలని ఆయన అన్నారు. వచ్చే సంవత్సరాల్లో ఆమె విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందనగా ధన్యవాదాలు ప్రియమైన ప్రధాని మోడీ అని మెలోని అన్నారు. ఎక్స్‌లో చేసిన పోస్టులో ప్రియమైన నరేంద్ర మోడీ, మీ మాటలకు, మీ స్నేహానికి ధన్యవాదాలు అని రాశారు. ఇటలీ- భారత దేశం సంబంధం ఈ రోజు ఎప్పటికంటే బలంగా ఉందని అన్నారు. మన చివరి సమావేశంలో ప్రారంభించిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం ఈ బంధం ప్రాముఖ్యతను, రెండు దేశాల నైపుణ్యాలను కలిపి, వృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించాలనే సంకల్పాన్ని గుర్తిస్తుందని చెప్పారు. ముందున్న అసాధారణ సహకార అవకాశా లను " సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటలీ, భారతదేశం కలిసి రెండు ఖండాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని, భారత్- మధ్యప్రా చ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ అభివృద్ధికి కూడా కలిసి పనిచేస్తాయని విశ్వాసాన్ని మెలా'ని వ్యక్తం చేశారు. మోడీ-మెలోని స్నేహం సామాజిక మాధ్యమాల్లో మెలోడి అనే పేరుతో దృష్టిని ఆకర్షిస్తుంది. ఇటీవల రోమ్ పర్యటనలో మోడీ మెలోనికి మెలోడి చాక్లెట్ల ప్యాకెట్ బహుమతి గా ఇచ్చిన సందర్భం మళ్లీ చర్చనీయాం శమైంది. ఇరు నాయకుల స్నేహం ద్వైపాక్షిక సంబంధా లను మరింత లోతుగా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులుఅభిప్రా యపడ్డారు.

# నేపాల్ వరదల్లో ఇద్దరికి పునర్జన్మ

### త్రిశూలీ సొరంగం శిథిలాల నుంచి 9 రోజుల తర్వాత ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు కార్మికులు

### మహా మంత్రాన్ని జపిస్తూనే ఉన్నానని అందులో ఒకరు వెల్లడి



**నేపాల్:** నేపాలును కుదిపేసిన భోటేకోషి నది వరదల అనంతరం పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. ఆగస్టు 28న భారీ వరదలు, కొండచరియలు విరిగిపడటంతో రసువా, నువాకోట్, ధాదింగ్ తదితర ప్రాంతాల్లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. గ్లేసియర్ కూలిపోవడం కారణంగా వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగినట్లు అధికారులు, అంతర్జాతీయ సంస్థలు పేర్కొన్నాయి. నేపాల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా వివరాల ప్రకారం ఇప్పటివరకు 1,287 మృతదేహాలను వెలికితీశారు. మరో 5,083 మంది ఆచూకీ తెలియడం లేదు. వీరిలో సుమారు 600 మంది విదేశీయులు ఉన్నారు. ఇప్పటివరకు 19,093 మందిని రక్షించారు. వరదల కారణంగా అనేక రహదారులు, వంతెనలు, ఇళ్లు, విద్యుత్ కేంద్రాలు, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మారుమూల ప్రాంతాలకు చేరుకోవడం సహాయక బృందాలకు ప్రధాన సవాలుగా మారింది. ఐక్యరాజ్యసమితి అభివృ ద్ధి కార్యక్రమం ప్రాథమిక అంచనా ప్రకారం భోటే కోషి-త్రిశూలి నదీ వ్యవస్థ సరిధిలో వరదలు, మట్టి ప్రవాహాల కారణంగా సుమారు 2.2 మిలియన్ టన్నుల శిథిలాలు పేరుకుపోయాయి. 11 జలవిద్యుత్ కేంద్రాలు,ఒక సౌర విద్యుత్ కేంద్రం కార్యకలాపాలు నిలిచిపోయాయి. నేపాల్ విపత్తు నిర్వ హ ణ సంస్థ ప్రాథమిక అంచనాల ప్రకారం మౌలిక వసతులు, నివాసాలు, వంతెనలు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, విద్యుత్, టెలికమ్యూనికేషన్ల రంగాల్లో మొత్తం నష్టం 387.54 బిలియన్ నేపాలీ రూపాయలుగా అంచనా వేశారు. భారీ సంఖ్య లో మృతదేహాలు లభ్యమవుతుండటంతో వాటిని గుర్తిం చడం అధికారులకు పెద్దసవాలుగా మారింది. అవసరమైన ఫోరెన్సిక్ ప్రక్రియలు పూర్తిచేసిన తర్వా త తాత్కాలికంగా మృతదేహాలను ఖననం చేస్తూ, డీఎన్ఏ నమూనాల ద్వారా గుర్తింపు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. నేపాల్ సైన్యంతో కలిసి భారత్, చైనా, దక్షిణ కొరియాకు చెందిన ప్రత్యేక సొరంగ రక్షణ బృందాలు పనిచేస్తున్నాయి. డ్రోన్లు, భారీ యంత్రాలు, ప్రత్యేక శోధన పరికరాలను వినియోగిస్తున్నారు.

### 9 రోజుల తర్వాత ఇద్దరు సజీవంగా..

భారీ వరదలు, కొండచరియలు విరిగిపడటంతో వందలాది మంది గల్లంతైన వేళ.. ఇద్దరు కార్మికులు మృత్యువును జయించి బయటపడ్డారు. త్రిశూలి-3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న ఇద్దరు కార్మికులను తొమ్మిది రోజుల తర్వాత సజీవంగా రక్షించారు. ఈ ఇద్దరు కార్మికులు తొమ్మిది రోజుల పాటు బయటప్రపంచంతో సంబంధాలు లేకుండా గడిపారు. వారిని గుర్తించిన రెస్క్యూ సిబ్బంది జాగ్రత్తగా సొరంగంలోకి ప్రవేశించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వెంటనే వారిని ప్రత్యేక హెలీకాప్టర్ ద్వారా నేపాల్ ఆర్మీ హాస్పిటల్కు చేరవేసి చికిత్స అందిస్తున్నారు. ఇంతకాలంతర్వాత వారు సజీవంగా బయటపడటం సహాయక బృందాలకు ఆశ్చర్యంతో పాటు ఆనందాన్ని కలిగించింది. ఇద్దరిలో ఒకరు నేపాల్ విద్యుత్ అదారిటీ ఉద్యోగి సంజయ్ షా కాగా, మరొకరు కార్మికుడు కబీర్ మహారాజన్, గత 3 రోజులుగా హరే కృష్ణ మహామంత్రాన్ని జపిస్తూ గడిపానని, జన్మాష్టమి రోజునే ప్రాణాలతో బయటకు రావడం మరో జన్మ ఎత్తినట్లుగా ఉన్నదని సంజయ్ షా సంతోషం వ్యక్త చేశారు.

### ఇది కనీవినీ ఎరుగని అద్భుతం

త్రిశూలి 3ఏ సొరంగం నుండి ఇద్దరు విద్యుత్ కార్మికులను 9రోజుల తర్వాత ప్రాణాలతో రక్షించడం అద్భుతం అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సిడ్నీ నుండి నేపాల్లో సహాయక చర్యలకు రిమోట్గా మార్గనిర్దేశం చేస్తున్న ప్రఖ్యాత సొరంగ రక్షణ నిపుణుడు ఆర్నాల్డ్ డిక్స్.. సొరంగం నుంచి ఇద్దరు కార్మికులను రక్షించడం అసాధారణమైనదిగా, ప్రపంచం మునుపెన్నడూ చూడనిదిగా అభివర్ణించారు. ఇది సహాయక బృందానికి లభించిన గొప్ప విజ యం అనీ, ఇద్దరినీ ప్రాణాలతో బయటకు తీసుకురావడం అసాధారణం అని డిక్స్ తెలిపారు.

# ఢిల్లీలో కుండపోత వర్షం

### జలమయమైన విమానాశ్రయం.. విమాన సేవలకు తీవ్ర అంతరాయం

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ట్రంప్ దృష్టిలో అగ్రస్థానంలో మోదీ

### అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!

**న్యూఢిల్లీ :** జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు. భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

# ఫుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం..

### డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు

**న్యూఢిల్లీ :** విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో పైలట్-ఇన్-కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది. భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరో-టాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "ఫుకెట్-ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము. ఈ కారణంగా ఆ పైలట్ సేవలను తక్షణమే రద్దు చేశాం'' అని ఆయన తెలిపారు. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పైలట్ డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలడం తీవ్రమైన ఆందోళన కలిగించే అంశమని, దీనిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ తన నివేదికలో సిఫారసు చేసింది. వివరాల ప్రకారం, ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో కలిపి మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం (ఏఐ-2379) ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంలో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, దానిలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. దీంతో విమానం అదుపుతప్పి ఒక్కసారిగా 372 అడుగులు పైకి వెళ్లి, ఆ తర్వాత 292 అడుగులు కిందికి వచ్చేసింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఢిల్లీలో ఇద్దరు పైలట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో ఇద్దరికీ నెగెటివ్ రాగా, మాదకద్రవ్యాల పరీక్షలో పీఐసీకి "నాన్-నెగెటివ్" ఫలితం వచ్చింది. అనంతరం నిర్ధారణ కోసం ఇద్దరి రక్త నమూనాలను ల్యాబొరేటరీకి పంపగా, పీఐసీ డ్రగ్స్ తీసుకున్నట్లు మరోసారి నిర్ధారణ అయింది. కో-పైలట్ ఫలితాలు మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ఈ ఘటనపై సాంకేతిక, ఇతర అంశాలపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానం బయలుదేరే ముందు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక పేర్కొంది.

# ఎయిర్‌ఫోర్స్ నుంచి అభినందన్ వర్ధమాన్ రిటైర్

### రెండు దశాబ్దాలకు పైగా వర్ధమాన్ విశిష్ట సేవలు


### ప్రైవేటు విమానయాన సంస్థలో కీలక బాధ్యతలు

**న్యూఢిల్లీ:** 2019 బాలాకోట్ వైమానిక దాడుల అనంతరం పాకిస్థాన్ ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చివేసి దేశవ్యాప్తంగా హీరోగా నిలిచిన గ్రూప్ కెప్టెన్ మాజీ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్, భారత వైమానిక దళం నుంచి ఘనంగా రిటైర్మెంట్ తీసుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా నిబద్ధతతో దేశ రక్షణ రంగంలో అందించిన విశిష్ట సేవలకు ముగింపు పలికి, ఆయన ఇప్పుడు తన కెరీర్‌లో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. వైమానిక దళం నుంచి వీడ్కోలు పొందిన అనంతరం ఆయన ఒక ప్రముఖ ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ లో కీలక బాధ్యతలు స్వీకరించారు. 2019 ఫిబ్రవరి 27న జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అభినందన్ చూపించిన తెగువ భారత మిలిటరీ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడింది. పాతతరం మిగ్-21 బైసన్ ఫైటర్ జెట్‌ను నడుపుతూనే, అత్యాధునిక అమెరికన్ మేడ్ పాకిస్థానీ ఎఫ్-16 విమానాన్ని లాక్ చేసి కూల్చివేసారు. ఆ సమయంలో తన విమానం కూడా దెబ్బతినడంతో పాక్ ఆక్రమిత కాశ్మీర్ భూభాగంలో పారాచూట్ ద్వారా దిగాల్సి వచ్చింది. పాకిస్థాన్ ఆర్మీ కస్టడీలో ఉన్నప్పటికీ, ఎలాంటి బెరింపులకు లొంగకుండా ఆత్మస్థైర్యంతో, ఆర్మీ సమాచారాన్ని బయటపెట్టకుండా నిలబడిన తీరు దేశ ప్రజలందరినీ ముగ్ధులను చేసింది. విశ్వవ్యాప్తంగా దౌత్యపరమైన ఒత్తిడి, భారత ప్రభుత్వ కఠిన వైఖరి కారణంగా పాకిస్థాన్ ప్రభుత్వం 60 గంటల్లోపే అభినందన్‌ను వాఘా సరిహద్దు ద్వారా సురక్షితంగా భారత్‌కు అప్పగించక తప్పలేదు. ఆయన చూపిన అసాధారణ ధైర్యసాహసాలకు గాను భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత మిలిటరీ పురస్కారం వీరచక్ర తో గౌరవించింది. ఆ తర్వాత ఆయన సైనిక హోదా పెరుగుతూ గ్రూప్ కెప్టెన్ స్థాయికి చేరుకున్నారు. సుదీర్ఘ వైద్య పరీక్షలు, పునరావాసం అనంతరం ఆయన తిరిగి యుద్ధ విమానాలను నడిపి తనలోని అసమాన ప్రతిభను నిరూపించుకున్నారు. సైనిక సేవలకు వీడ్కోలు చెప్పిన అభినందన్, ఇప్పుడు ప్రైవేట్ విమానయాన రంగంలోకి అడుగుపెడుతున్నారు. డిఫెన్స్ విమానాలను నడపడంలో ఉన్న ఆయన సుదీర్ఘ అనుభవం, పైలటింగ్ నైపుణ్యాలు , క్లిష్ట సమయాల్లో నిర్ణయాలు తీసుకునే వ్యూహాత్మక సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి ప్రధాన ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ ఆయనకు కీలక సీనియర్ కమాండ్ బాధ్యతలను అప్పగించింది.

# ఈ నెల 22న టీమిండియా, జపాన్ క్రికెట్ మ్యాచ్

భారత్, జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొని 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఈ మైత్రిని మరింత బలోపేతం చేసే దిశగా ఒక చారిత్రక క్రికెట్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్, జపాన్ దేశాల పురుషుల జట్ల మధ్య ఈ నెలలో ఒక ప్రత్యేక టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. 'సుజుకి కప్' పేరుతో జరగనున్న ఈ మ్యాచ్‌కు సెప్టెంబర్ 22న జపాన్‌లోని టోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనే తకైచి మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన 'స్పోర్ట్ 75' ఒప్పందంలో భాగంగా ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. ఇరు దేశాల మధ్య క్రీడా సంబంధాలను, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ ఒప్పందం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ చారిత్రక మ్యాచ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి దేవజిత్ సైకియా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చారిత్రక ఘట్టంలో భాగం కావడం బీసీసీఐకి ఎంతో ఆనందంగా ఉంది. ఇది క్రికెట్‌కు చాలా ముఖ్యమైన క్షణం. భారత జట్టును జపాన్‌కు తీసుకెళ్లడం ద్వారా తూర్పు ఆసియాలో ఈ క్రీడను విస్తృత ప్రేక్షకులకు పరిచయం చేసే అవకాశం లభిస్తుంది" అని ఆయన తెలిపారు. భారత్-జపాన్ మధ్య బలమైన స్నేహ బంధం ఉందని, ఈ వేడుకల్లో క్రికెట్‌ను భాగం చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సంప్రదాయ దేశాలు దాటి ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను విస్తరించే బాధ్యత తమపై ఉందని, ఈ దిశగా జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ)తో కలిసి పనిచేస్తామని సైకియా వివరించారు. మరోవైపు, జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నవోకి మియాజీ మాట్లాడుతూ, "ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్లను జపాన్‌లో మా సొంత గడ్డపైకి ఆహ్వానించడం మా అసోసియేషన్‌కు ఒక చారిత్రక ఘట్టం. ఈ లక్ష్య సాధనకు సహకరించిన బీసీసీఐకి ధన్యవాదాలు" అని అన్నారు. భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహానికి స్వాగతం పలుకుతున్నామని, స్థానిక జపనీయులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి తమ జట్టును ప్రోత్సహించాలని కోరారు. ఈ మ్యాచ్‌కు అభిమానుల తాకిడి అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్న నిర్వాహకులు, సానో మైదానం సామర్థ్యాన్ని 500 నుంచి 2,000కు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే అధికారిక సోషల్ మీడియా ఛానెళ్లలో టికెట్ల అమ్మకాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 24 నుంచి జపాన్‌లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు అక్కడికి వెళుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ఏర్పాటు చేశారు. ఆసియా క్రీడల కోసం భారత జట్టుతో పాటు నెట్ బౌలర్లుగా లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ విక్కీ ఓస్వాల్, పేసర్లు రసిఖ్ సలామ్, కార్తీక్ త్యాగి కూడా జపాన్‌కు వెళ్లనున్నారు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో ఉన్న ఈ ముగ్గురు యువ బౌలర్లకు ఇది మంచి అవకాశమని, వారి పాస్‌పోర్ట్, వీసా ప్రక్రియలు కొనసాగుతున్నాయని బీసీసీఐ వర్గాలు తెలిపినట్లు ఐఏఎన్ఎస్ తన కథనంలో పేర్కొంది.



# దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సిరాజ్, పడిక్కల్

### సౌత్ జోన్ జట్టులో చోటు!

దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరుకు భారత స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 6 నుంచి ఈస్ట్ జోన్‌తో జరగనున్న ఫైనల్ కోసం సౌత్ జోన్ జట్టులో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఇద్దరూ భారత్ తరఫున ఆడారు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది. శ్రీలంక సిరీస్‌లో పడిక్కల్ అద్భుతంగా రాణించాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు సిరాజ్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం వీరిద్దరూ సౌత్ జోన్ జట్టులో ఎవరిని భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. టీ20 జట్టులో రెగ్యులర్‌గా ఉంటున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా ఫైనల్‌లో ఆడే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 10న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగియనుండగా.. సెప్టెంబర్ 13 నుంచి అఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అయినా ఫైనల్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తిలక్ ఇప్పటికే చెప్పాడు. నార్త్ జోన్‌తో సెమీఫైనల్లో తిలక్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులతో ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ సెమీఫైనల్లో నార్త్‌ను 181 పరుగుల ఛేదనలో ఓడించింది. మరోవైపు ఈస్ట్ జోన్ 159 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఫైనల్ రేసు నుంచి తప్పించింది. ఇషాన్, సూర్యవంశీ ఆడకపోతే ఈస్ట్ జోన్ కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. బెంగాల్‌కు చాలాకాలంగా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అభిమన్యు ఈశ్వరన్‌కు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.



# వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి

### ఆ ఒక్క తప్పు చేయొద్దంటూ సూచన!

భారత క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి పెట్టింది. అతడి కెరీర్ ఒక్క సిరీస్, ఒక్క ఏడాదికే పరిమితం కాకుండా సుదీర్ఘంగా సాగాలని బోర్డు భావిస్తోంది. వైభవ్‌తో పాటు ప్రతిభ చూపుతున్న యువ ఆటగాళ్లకు సరైన మార్గదర్శకత్వం, సహకారం అందించాలని నిర్ణయించింది. ముంబైలో గురువారం బీసీసీఐ కీలక సమీక్ష సమావేశం నిర్వహించింది. కార్యదర్శి దేవజిత్ సైకియా, టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సీవోఈ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాత వైభవ్‌పై బీసీసీఐ ఆలోచనను సైకియా స్పష్టం చేశారు. 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఆటగాడిని ఎంతో జాగ్రత్తగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సచిన్ టెండూల్కర్‌లా వైభవ్ సూర్యవంశీ దేశానికి సుదీర్ఘకాలం సేవలందించే ఆటగాడిగా ఎదగాలని బీసీసీఐ కోరుకుంటోందని చెప్పారు. అతడి కెరీర్‌ను ప్రతి దశలోనూ నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే వైభవ్ 15 ఏళ్ల 157 రోజుల వయసులో దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యంత పిన్న వయసులో అర్ధశతకం చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 57 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 151 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. భారత్ ఆ సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆటగాడిగా వైభవ్ నిలిచాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అతడు 776 పరుగులు చేశాడు. 237.30 స్ట్రైక్‌రేట్‌తో ఆడాడు. ఒక సెంచరీ, ఐదు అర్ధశతకాలు బాదాడు. 72 సిక్సర్లతో టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అండర్-19 ప్రపంచకప్‌లోనూ వైభవ్ 439 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డు అందుకున్నాడు.

# క్రికెట్‌లో వయసు గోల్‌మాల్

### భారత అండర్-19 జట్టుకు ఎంపికైన కొద్దివారాలకే యువ స్పిన్నర్‌పై రెండేళ్ల నిషేధం!



భారత క్రికెట్‌లో వయసు తారుమారు వ్యవహారం మరోసారి తీవ్ర కలకలం రేపింది. ఆస్ట్రేలియాతో జరగబోయే సిరీస్ కోసం భారత అండర్-19 జట్టుకు ఎంపికైన కొద్ది వారాలకే, బెంగాల్ లెగ్ స్పిన్నర్ రోహిత్ యాదవ్‌పై బీసీసీఐ రెండేళ్ల నిషేధం విధించింది. వయసును తప్పుగా చూపించాడన్న ఆరోపణలతో ఈ కఠిన చర్యలు తీసుకుంది. వాస్తవానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్ యాదవ్, బెంగాల్ తరఫున ఆడుతున్నాడు. గత జులైలో శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత అండర్-19 జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. ఆ సిరీస్‌లో అద్భుతంగా రాణించి ఆరు వికెట్లు పడగొట్టి, ఫైనల్ టెస్టులో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నెలలోనే ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో రాజ్‌కోట్, అహ్మదాబాద్‌లలో జరగనున్న వన్డే, మల్టీ-డే మ్యాచ్‌లకూ ఎంపికయ్యాడు. అయితే, శ్రీలంక పర్యటనలోనే అతని ధ్రువపత్రాల పరిశీలన సందర్భంగా వయసులో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విచారణలో రోహిత్ యాదవ్‌కు 2007, 2009, 2010 సంవత్సరాలతో మూడు వేర్వేరు జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లు తేలింది. దీనికి తోడు అతని ఆధార్ రికార్డుల్లోనూ తీవ్ర వ్యత్యాసాలు కనిపించాయి. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (సీఏబీ)లో నమోదు చేసుకున్నప్పుడు అతని పుట్టిన సంవత్సరం 2007గా ఉంది. ఆ తర్వాత 2017, 2020లో చేసిన అప్‌డేట్స్‌లో 2006గా మారి, మళ్లీ 2021లో 2009గా మార్పు చెందినట్లు గుర్తించారు. ఈ తేడాల కారణంగానే, సీఏబీ అతడిని తమ జూనియర్ జట్లకు దూరంగా ఉంచి, విషయాన్ని బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లింది. తాజాగా బీసీసీఐ రెండేళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో పాల్గొనకుండా రోహిత్‌పై నిషేధం విధిస్తూ అన్ని రాష్ట్రాల క్రికెట్ సంఘాలకు సమాచారం ఇచ్చింది.

### 62 మంది క్రికెటర్లపై సీఏబీ కఠిన చర్యలు

రోహిత్ యాదవ్ ఉదంతం ఒక్కటే కాదు.. వయసు, ధ్రువపత్రాల విషయంలో అవకతవకలకు పాల్పడిన మొత్తం 62 మంది ఆటగాళ్లపై సీఏబీ కొరడా ఝుళిపించింది. 2026-27, 2027-28 సీజన్లలో ఏ టోర్నమెంట్‌లోనూ రిజిస్ట్రేషన్ లేదా బదిలీకి అనర్హులుగా ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాను తమ అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఉంచింది. ఈ జాబితాలో 2022 అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక సభ్యుడైన రవి కుమార్, ఫస్ట్-క్లాస్, లిస్ట్-ఏ మ్యాచ్‌లు ఆడిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ ఆల్-రౌండర్ విశాల్ భట్టి వంటి ప్రముఖ ఆటగాళ్ల పేర్లు కూడా ఉండటం గమనార్హం. రవి కుమార్ విషయంలో ఏకంగా 45 నెలల వయసు తేడా ఉన్నట్లు సీఏబీ రికార్డులు చెబుతున్నాయి.



# టీ20 క్రికెట్‌లో తెలుగు తేజం శ్రీ చరణి అరుదైన ఫీట్!

దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు తన జోరును కొనసాగిస్తోంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణులు అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా యువ బౌలర్, తెలుగు తేజం శ్రీ చరణి తన అద్భుతమైన బౌలింగ్‌తో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 193 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 194 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. ముఖ్యంగా శ్రీ చరణి తన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టింది. తన అద్భుతమైన బౌలింగ్‌తో హాంకాంగ్ పతనాన్ని శాసించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో కేవలం 3.2 ఓవర్లు బౌలింగ్ చేసిన శ్రీ చరణి, 16 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టింది. ఈ ప్రదర్శనతో ఆమె ఒకే క్యాలెండర్ ఇయర్‌లో భారత మహిళల జట్టు తరఫున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. 2026 క్యాలెండర్ ఇయర్‌లో చరణి ఇప్పటివరకు మొత్తం 31 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో 2024లో 30 వికెట్లు తీసిన దీప్తి శర్మ రికార్డును ఆమె అధిగమించింది. ప్రస్తుతం ఈ జాబితాలో స్పిన్నర్ పూనమ్ యాదవ్ అగ్రస్థానంలో ఉంది. ఆమె 2018లో 35 వికెట్లు తీసి ఈ రికార్డును నెలకొల్పింది. చరణి ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, ఈ ఏడాది ముగిసేలోపు పూనమ్ యాదవ్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



# కొణిదెల వారి ఇంట్లో చిన్ని కృష్ణుడు సందడి

మెగా హీరో రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. తమ కుమారుడు, కూతుర్లను శ్రీకృష్ణుడు, రాధారాణి వేషధారణలో అలంకరించి పూజలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫొటోను మెగా కోడలు ఉపాసన సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. "కల నెరవేరింది. నిజంగా ధన్యమైనది. ఓం నమో భగవతే వాసుదేవాయ. అందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు" అని ఉపాసన ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. ఇందులో చెర్రీ - ఉపాసన దంపతులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి, తమ పూజా మందిరంలో విగ్రహాల ముందు కూర్చుని పూజ చేస్తూ కనిపిస్తున్నారు. తమ కవల పిల్లలను ఒళ్లో కూర్చొని పెట్టుకుని పూజా కార్యక్రమంలో పాల్గొంటుండగా, వారి పెద్ద కుమార్తె క్లిన్ కార తన తల్లిదండ్రులు మధ్య కూర్చుని ఉంది. ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. 'కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగుపెట్టాడు' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఉపాసన షేర్ చేసిన ఫొటోలో తమ ముగ్గురు చిన్నారుల ఫేస్ కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. అయినప్పటికీ 'కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగుపెట్టాడు' అంటూ మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెగా కపుల్ కి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు చెబుతూ కామెంట్లు చేస్తున్నారు. మెగా ఫ్యామిలీ కృష్ణాష్టమి స్పెషల్ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రామ్ చరణ్ - ఉపాసన దంపతులు 2023 జూన్ 20న క్లీంకారకు జన్మనిచ్చారు. ఈ ఏడాది జనవరి 31న వీరికి కవలలు జన్మించారు. బాబుకి శివరామ్, పాపకి అన్వీరా దేవి అని పేర్లు పెట్టారు. ట్విన్స్ రాకతో మెగా ఫ్యామిలీలో ఆనందాలు వెల్లువెత్తాయి. కొణిదెల ఫ్యామిలీలోకి మూడో తరం వారసుడు వచ్చాడని మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, రామ్ చరణ్ ఇటీవల బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'లో కనిపించారు. ఈ పాన్ ఇండియా సినిమా బాక్సాఫీస్ దగ్గర రూ.400 కోట్ల గ్రాస్ రాబట్టినట్లు మేకర్స్ ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలో చెర్రీ ఓ సినిమాని ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లలో భారీ బడ్జెట్ తో ఈ చిత్రం తెరకెక్కనుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. చరణ్ ఈ మధ్యనే సర్జరీ చేయించుకోవడంతో,ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాత సినిమాని సెట్స్ మీదకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు.


# చిరంజీవి 'కాకా'.. సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమా షూటింగ్‌పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. చిరంజీవి సహా ప్రధాన తారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ సుదీర్ఘంగా, అత్యంత కీలకమని చిత్రబృందం తెలిపింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా, "'కాకా' సెప్టెంబర్ 7 నుంచి మళ్లీ యాక్షన్‌లోకి దిగుతోంది. మెగాస్టార్ చిరంజీవి గారు, ప్రధాన తారాగణం పాల్గొనే సుదీర్ఘమైన, కీలకమైన షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది" అని పోస్ట్ చేసింది. దీంతోపాటు సినిమాను 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి స్పష్టం చేసింది. ఇటీవలే చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'కాకా' టైటిల్ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో చిరంజీవి రావులపాలెంలోని 'అమ్మాజీ ఆక్వా ఇండస్ట్రీస్'లో సూపర్‌వైజర్ సత్యంగా కనిపించారు. రొయ్యల చెరువులో పడిపోయిన తాళం చెవిని ఒక భారీ విద్యుదయస్కాంతంతో బయటకు తీయగా, దానితో పాటు తుపాకులు, ఇతర ఆయుధాలు రావడం టీజర్‌పై ఆసక్తిని పెంచింది. తాళం చెవికి ఉన్న 'ఐ లవ్ డాడ్' కీచైన్ సినిమాలో బలమైన భావోద్వేగ అంశం కూడా ఉందని సూచించింది. సినిమా వర్గాల నుంచి వస్తున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా ఉండబోతోందని తెలుస్తోంది. ఇటీవల చిత్రీకరించిన ఈ ఫైట్, సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలు సమపాళ్లలో ఉన్నాయని చిత్రబృందం నమ్మకంతో ఉంది. ఇప్పటికే ఫస్టాఫ్ ఎడిటింగ్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. ఈ భారీ చిత్రంలో అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ విజయం సాధించడంతో 'కాకా'పై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



# తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా

బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు. 'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో ఓ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) నిర్మిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు మరో ప్రధాన పాత్రలో సందడి చేయనున్నారు. రవితేజ మార్క్ జోష్‌కు శ్రీవిష్ణు పంచ్‌లు జతకలిస్తే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ మల్టీస్టారర్ చిత్రాన్ని 2027 సంక్రాంతి పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. మొత్తానికి హసిత్ గోలి సినిమా పూర్తి కాగానే వివేక్ ఆత్రేయ హారర్ కామెడీ సెట్స్‌పైకి వెళ్లనుంది.



# కిట్టయ్య సాంగ్‌కు అనసూయ.. ఫుల్ స్టాప్ పెట్టినట్లేనా?

ఇటీవల పలు కామెంట్స్ తో వార్తల్లో నిలిచిన యాక్ట్రెస్ అనసూయ.. ఇప్పుడు కృష్ణుడి సాంగ్ తో అందరి దృష్టిని ఆకర్షించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా షేర్ చేసిన ఓ డ్యాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే వీడియోలో ఆమె డ్యాన్స్ ఎంతగా ఆకట్టుకుందో.. చివర్లో పెట్టిన క్యాప్షన్ అంతకంటే ఎక్కువ చర్చకు దారితీస్తోంది. దీంతో సనాతన ధర్మంపై ఇటీవల తనపై వచ్చిన విమర్శలకు అనసూయ ఇలా ఫుల్ స్టాప్ పెట్టారా? అనే ప్రశ్న వినిపిస్తోంది. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా అనసూయ రాధా గెటప్ లో కనిపించారు. ఎరుపు రంగు చీరలో, స్పెషల్ మేకప్ తో ఆమె చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. ఇన్‌స్టాగ్రామ్ లో వైరల్ గా మారిన 'తులసి కోమలవేణి.. అనే కన్నడ సాంగ్ కు ఆమె డ్యాన్స్ చేశారు. పాటకు తగ్గట్టుగా చేసిన ఎక్స్‌ప్రెషన్స్, డ్యాన్స్ మూవ్మెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయితే ఆ వీడియోకు అనసూయ ఇచ్చిన క్యాప్షన్ ఇప్పుడు అసలు చర్చకు కారణమైంది. 'కృష్ణుడికి అంతా తెలుసు. నాకు అది చాలు' అంటూ ఆమె పేర్కొన్నారు. అంతేకాదు.. శాంతం, నిగ్రహం, తపస్సు, పవిత్రత, సహనం, సరళత, జ్ఞానం, సాక్షాత్కారం, విశ్వాసం, బ్రహ్మచర్యం వంటి పదాలను కూడా ప్రస్తావించారు. దీంతో తనపై జరుగుతున్న చర్చకు డైరెక్ట్ గా రెస్పాండ్ అవ్వకుండా.. తన నమ్మకాన్ని ఇలా చెప్పారా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనసూయకు సోషల్ మీడియాలో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాంకర్ గా కెరీర్ ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత నటిగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా రంగస్థలం, 'పుష్ప' వంటి సినిమాలతో నటిగా తన స్థాయిని పెంచుకున్నారు. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలను పంచుకునే ఆమె.. కొన్ని సందర్భాల్లో చేసే వ్యాఖ్యల కారణంగా విమర్శలను కూడా ఎదుర్కొంటున్నారు. ఇటీవల హిందూ ధర్మం, దేవుడి పేరును ఉపయోగించుకోవడం వంటి అంశాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. కొందరు ఆమెను తీవ్రంగా విమర్శించగా.. అనసూయ కూడా తనదైన శైలిలో స్పందించారు. దీంతో ఆ అంశం కొంతకాలం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ఇలాంటి సమయంలోనే కృష్ణుడి సాంగ్ కు రాధగా అనసూయ చేసిన డ్యాన్స్ రావడం ఆసక్తిని పెంచింది.



# నోరుపారేసుకున్న నటి కస్తూరి

కొందరు సెలబ్రిటీలు ఏం మాట్లాడినా, ఏం చేసినా ఖచ్చితంగా వివాదాస్పదం అవుతుంది. ఈ కోవలోకే వస్తారు తమిళ నటి కస్తూరి శంకర్. మనసులో ఎలాంటి భావం ఉన్నా ఉన్నది ఉన్నట్లు ముఖం మీద చెప్పడంతో ఈమె ముందు వరుసలో ఉంటారు. తొలి నుంచి డేరింగ్ అండ్ డాషింగ్ బిహేవియర్‌తో ఏరికోరి వివాదాల్లో చిక్కుకున్నారు కస్తూరి. సినీరంగంలో మహిళలపై వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్‌తో పాటు తమిళనాడులో ఉంటున్న తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి జైలుకు కూడా వెళ్లొచ్చారు. ఆ తర్వాత కాస్త సైలెంట్ అయినప్పటికీ తిరిగి యాక్టీవ్ అయ్యారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తుతం హీరో పాత్రలను చూపిస్తున్న విధానంపై కస్తూరి శంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1991లో ఆతా ఉన్ కోయిలే సినిమా ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఆమె.. మూడున్నర దశాబ్ధాల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వందకు పైగా చిత్రాల్లో నటించారు. నిప్పు రవ్వ, గాడ్ ఫాదర్, సొగ్గాడి పెళ్లాం, మెరుపు, చిలక్కొట్టుడు, అన్నమయ్య, మా ఆయన బంగారం, ఆకాశ వీధిలో, డాన్ శీను, శమంతకమణి, సింబా వంటి సినిమాలతో తెలుగువారిని పలకరించారు. కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకున్న కస్తూరి ఆ తర్వాత తన కెరీర్‌కు కొన్నాళ్లు బ్రేక్ ఇచ్చి ఫ్యామిలీ, పిల్లల కోసం అంకితమయ్యారు. ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన కస్తూరి.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారిపోయారు. సినిమాలే కాదు బుల్లితెరపైనా ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరిస్తున్నారు. తెలుగులో ఆమె నటించిన గృహలక్ష్మీ సీరియల్.. ప్రేక్షకులకు కస్తూరిని దగ్గర చేసింది. ప్రస్తుతం ధర్మస్థల నియోజకవర్గం అనే తెలుగు మూవీలో కస్తూరి శంకర్ నటించారు. ఇందులో నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో కస్తూరి నటించినట్లుగా వార్తలు వస్తున్నాయి. మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ బ్యానర్‌పై మేరుం భాస్కర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర, వరుణ్ సందేశ్, వితికా షేరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 4న ధర్మస్థల నియోజకవర్గం మూవీ వరల్డ్ వైడ్‌గా విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్ కార్యక్రమాల్లో భాగంగా చిత్ర యూనిట్ ఓ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ సందర్భంగా కస్తూరి మాట్లాడారు. ఈ మధ్యకాలంలో అన్ని రకాల సినిమాలు వస్తున్నాయి. సినిమాను సినిమాగానే చూడాలని ఒకపక్క ఉంది. తెలుగు సినిమాలు చూస్తూ పెరిగిన దానిని, మాయాబజార్.. కృష్ణార్జున యుద్ధం, ప్రేమాభిషేకం లాంటి సినిమాలు చేసి పెరిగాను. అప్పుడు చూస్తే తెలుగు సినిమాల్లో హీరోలంటే దేవుడు.. దేవుడి అవతారాలు కనిపించేవి. ఆ తర్వాత సాంఘిక చిత్రాలు వచ్చాయి. వాటిలో హీరో పోలీస్, లాయర్, విప్లవకారుడు, న్యాయం కోసం పోరాడే వ్యక్తిగా కనిపించాడు. ఇప్పుడొచ్చే సినిమాల్లో స్మగ్లర్, క్రిమినల్, గ్యాంగ్‌స్టర్ అలాంటి సినిమాలే వస్తున్నాయి. ఇలాంటి వాటి మధ్య ఒక సామాజిక బాధ్యతతో, సామాజిక సందేశంతో వస్తున్న మూవీ అంటే చాలా అరుదు అన్నట్లుగా మారిపోయింది. అలాంటి సినిమాల్లో మా ధర్మస్థల నియోజకవర్గం కూడా ఒకటి అని కస్తూరి చెప్పారు. డైరెక్టర్ ప్రభ గారు నా దగ్గరికి వచ్చిన స్టోరీలో ఒక లైన్ చెప్పారు. అప్పుడే ఆ స్టోరీ నాకు బాగా నచ్చేసింది. నిర్మాత భాస్కర్ గారు ఏఎం రత్నంగారి టీమ్.. నన్ను తెలుగువారిని పరిచయం చేసింది భారతీయుడు చిత్రం. ఆ కనెక్షన్ కూడా నాకుంది. భారతీయుడు, అన్నమయ్య లాంటి సినిమాలు చేసి ఆ తర్వాత పెళ్లి చేసుకుని ఫారిన్‌కి వెళ్లిపోయా. ఇప్పుడు మళ్లీ తిరిగొచ్చి గృహలక్ష్మీగా అందరికి దగ్గరైన కస్తూరిని ఈ సినిమాలో ఎలా చూపిస్తారో అనుకున్నాను. కానీ ఆయన వచ్చి నన్ను దారుణమైన నెగిటివ్ క్యారెక్టర్ చేయించడంతో షాకయ్యా. నేను ఇప్పటి వరకు ఇలాంటి రోల్‌లో అస్సలు చేయలేదు. కస్తూరి అంటే మా ఇంటి ఆడపిల్ల అని అందరూ అనుకునేవారు.. కానీ ఈ సినిమాలో చీర కూడా కట్టనివ్వలేదు అని కస్తూరి తెలిపారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి.



PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342